నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాలానగర్/కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 16 : 33/11 కేవీ విద్యుత్ మరమ్మతు పనులు, చొట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బోయిన్‌పల్లి సెంట్రల్ బ్రేక్‌డౌన్(సీబీడీ) ఏడీఈ పణ్యాల శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు 11కేవీ రామ్‌రాజ్‌నగర్ ఫీడర్ పరిధి స్వర్ణదామనగర్, డైరీఫాం రోడ్డులో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నది. 11:30 నుంచి 1:00 గంటల వరకు శంకర్‌ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3 నుంచి 4:30 గంటల వరకు కళింగ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నది.

■ జగద్గిరిగుట్ట : జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ రాధాకిషన్‌రెడ్డి తెలిపారు. ఔట్‌పోస్ట్ చౌరస్తాలో లైన్ల మార్పిడి జరుగుతున్నది. పనుల్లో భాగంగా దేవమ్మబస్తీ, బీరప్పనగర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

■ కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ విద్యాసాగర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు భువన విజయం గ్రౌండ్, ఎంఐజీ 570, ఎంఐజీ 701 నుంచి 850, ఎంఆర్‌వో ఆఫీస్, ఈడబ్ల్యూస్ రోడ్డు, ఫోస్టాఆఫీస్, చాకలీడబ్బా, శివాలయం రోడ్డు, మహారాష్ట్ర బ్యాంక్, గ్లోబల్‌ఎడ్జ్ స్కూల్, ఆర్‌ఆర్ చికెన్ సెంటర్, ధనలక్ష్మీ సెంటర్, ఎల్‌ఐజీ గృహాలు, బీఎస్‌ఎన్‌ఎల్ క్వాటర్స్, ఫిష్‌మార్కెట్ ఏరియా, ఎన్‌ఎస్‌ఎల్, డీమార్ట్ ఏరియా, రోడ్డు నం. 1, ధనలక్ష్మీ సెంటర్, లెన్స్‌కార్ట్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్లున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

స్కూల్, కళాశాల నిర్మాణం పూర్తి చేయాలి

■ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
■ పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్/మియాపూర్,ఆగస్టు16: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, ప్రభుత్వ కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, అత్యంత ఖరీదైన ప్రాంతంలో, విశాలమైన ప్రాంగణంలో అన్ని హంగులతో, అత్యాధునిక వసతులతో భవన నిర్మించడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లో నూతనంగా నిర్మించబోయే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల నిర్మాణ పనులను శుక్రవారం మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తోపాటు పార్టీ నాయకులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, ప్రభుత్వ కళాశాల నిర్మాణ పలను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇక్కడి పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో టీజీఎంఆర్‌ఈఐఎస్ సీఈ హబీబ్ అహ్మద్, అడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈఈ ప్రభాకర్, ఏఈ శ్యామ్ కుమార్, ఆర్ఐ శ్రీనివాస్ తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రారెడ్డి, మాజీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస, సర్వర్, సంతోష్ ఉన్నారు.

రహదారుల విస్తరణ వేగంగా చేపట్టండి..

మియాపూర్: పెరుగుతున్న ట్రాఫిక్ నేపథ్యంలో రహదారుల విస్తరణను అత్యంత ప్రాధాన్యతగా వేగవంతంగా చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కోరారు. ఇప్పటికే నిర్మించిన లింక్ రోడ్ల వల్ల సత్ఫలితాలున్నందున ఇక్కడా వాటి ప్రక్రియను జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. నియోజవకర్గ సమస్యల పరిష్కారంతోపాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ జడ్‌సీ గంగాధర్‌రెడ్డి శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ..శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ రోడ్డు విస్తరణ, గంగారం హనుమాన్ దేవాయల ప్రధాన రహదారి నుంచి అపర్ణ వరకు లింక్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. తన వినతి పట్ల జడ్సీ ఉపేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

■ శేరిలింగంపల్లి మండల మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు సంబంధించిన గోడ పత్రికను కార్పొరేటర్ మాధవరం రోజాదేవిరంగారావు, ప్రిన్సిపాల్ చందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం తన నివాసంలో ఆవిష్కరించారు. పాఠశాలలో 6, 7 తరగతులతోపాటు ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంగారావు, నేతలు పాల్గొన్నారు.

టీజీఎస్ ఆర్‌టీసీ లాజిస్టిక్స్ సెంటర్ ప్రారంభం

చందానగర్‌లో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆర్టీసీ అధికారులు

కొండాపూర్, ఆగస్టు 16: తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థ లాజిస్టిక్స్ సేవలను చందానగర్‌లో అందుబాటులోకి తీసుకుస్తున్నట్లు, దీని కోసం నూతనంగా టీజీఎస్ ఆర్‌టీసీ లాజిస్టిక్స్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఆర్టీసీ సీటీఎం(జీహెచ్‌జెడ్) మధుసూదన్, ఏటీఎం (లాజిస్టిక్స్) వెంకటనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరై సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ అందిస్తున్న లాజిస్టిక్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రైవేట్ సంస్థల కంటే తక్కువ ధరలతో కచ్చితమైన, జాగ్రత్తలను పాటిస్తూ సకాలంలో చేరవేయడంలో ఆర్టీసీ ముందు వరుసలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది శ్రావణ్, జంబన్న, విజేందర్‌రెడ్డి, ఏజెంట్ ఈ రమేశ్ పాల్గొన్నారు. టీజీఎస్ ఆర్టీసీ ఏజెంట్స్ నియామకం కోసం 9652267204/89195 25373 నంబర్ల ద్వారా సంప్రదించాల్సిందిగా తెలిపారు.

ఉన్నత ప్రమాణాలతో బోధన సాగాలి

బోధనలో ఉన్నత ప్రమాణాలు కొనసాగిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని పలువురు విద్యావేత్తలు అన్నారు. రంగారెడ్డినగర్ బ్రైట్‌కాన్సెప్ట్ హైస్కూల్ నియోజకవర్గ స్థాయిలో ప్రతిభాపురస్కారం, ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌కు ఎంపికైందని నిర్వాహకులు తెలిపారు. స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో మున్సిపల్ ఉప కమిషనర్ నరసింహులు, హెచ్‌వైఎం సంస్థ ప్రతినిధి ఆలపాటి శివయ్య గురువారం అతిథులుగా హాజరై పాఠశాల చైర్మన్ వినోద్‌జాదవ్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ కృష్ణంరాజు, ఎంటమాలజీ అధికారి ఉమారాణి, పాఠశాల ఇన్‌చార్జి అయేషా బేగం, రజాక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు. *– జగద్గిరిగుట్ట, ఆగస్టు 16*

సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం

సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.14,94,000 విలువ జేసే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను 50 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ అండగా నిలుస్తుందన్నారు. పేదల కష్టాల్లో ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు. *– కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 16*

హాప్ ఆన్ కంగారు బ్రాండ్ అంబాసిడర్‌గా పీవీ ముని మనుమరాలు

ఎంఓయు పత్రాలు అందుకుంటున్న పీవీ ముని మనువరాలు అదితి సిరి గాయత్రి

మాదాపూర్, ఆగస్టు 16: ప్రముఖ, స్పోర్ట్స్, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ అయిన హాప్ ఆన్ కంగారూ బ్రాండ్ అంబాసిడర్‌గా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ముని మనువరాలు అదితి సిరి గాయత్రి మారం రాజును నియమించారు. ఈ నేపథ్యంలో మాదాపూర్‌లోని జూబ్లీ రిడ్జ్ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాప్ ఆన్ కంగారూ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ హరీశ్ బిసామ్ వివరాలు వెల్లడించారు. పీవీ ముని మనువరాలు అదితి సిరి గాయత్రి నాయకత్వం, సేవ, జాతికి అంకితభావంతో వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తుతున్నట్లు చెప్పారు. భారతదేశంలో హాప్ ఆన్ కంగారూకి అధికారిక బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితతులైనందున గౌరవంగా భావిస్తున్నానని అదితి సిరి గాయత్రి మారం రాజు అన్నారు. క్రీడలు, వ్యక్తిగత అభివృద్ధి ద్వారా మన దేశంలోని యువతకు సాధికారత కల్పించేందుకు హాప్ ఆన్ కంగారూతో కలిసి పనిచేయడం సంతోసంగా ఉందన్నారు. ఇండియా నుంచి మొదటి బ్రాండ్ అంబాసిడర్‌గా అదితి దేశవ్యాప్తంగా హాప్‌ఆన్ కంగారూ విలువలు, మిషన్‌ను ప్రచారం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు.

వరద నీరు నిలిచే ప్రాంతాల్లో హోల్డింగ్ స్ట్రక్చరు

ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్

వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్ల నిర్మాణ వివరాలను దాన కిశోర్‌కు వివరిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

మియాపూర్, ఆగస్టు 16: రహదారులపై వరద నీరు నిల్వకుండా ఉండేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధునాతన వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్లను నిర్మిస్తున్నట్లు మున్సిపల్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ పేర్కొన్నారు. వీటి నిర్మాణాలతో రహదారులపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఏర్పడుతున్న అంతరాయానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని రోడ్ నంబర్ 45, నెక్టార్ గార్డెన్స్, సైబర్ టవర్స్ ప్రాంతాల్లో ఎస్ఎన్‌డీపీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్ల(ఇంకుడు గుంతల)ను జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గం చెరువులో నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్‌ను తనిఖీ చేశారు. అనంతరం దాన కిశోర్ మాట్లాడుతూ.. కీలకమైన ప్రధాన రహదారులపై వరద నీరు ఇంకుడు గుంతల్లోకి తక్షణమే చేరుతుందని, తద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగదన్నారు. ప్రత్యేక మోటార్లతో వీటిల్లోని వరద నీటిని సమీపంలోని నాలాలు, డ్రైన్లలోకి నింపే ఏర్పాటు చేస్తున్నట్లు దాన కిశోర్ పేర్కొన్నారు. ప్రయోగాత్మకంగా తొలుత శేరిలింగంపల్లి జోన్‌లో చేపడుతున్న ఈ తరహా నిర్మాణాలను దశలవారీగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. జాప్యం లేకుండా నిర్మాణాలను పూర్తి చేయాలని, నీటి మళ్లింపు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ఎన్ఎన్‌డీపీ సీఈ కిషన్, ఎస్ఈ శంకర్, డీఈఈ రమేశ్ ఉన్నారు.

డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలి

శేరిలింగంపల్లి, ఆగస్టు 16: శేరిలింగంపల్లి సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గాప్రసాద్‌ను శుక్రవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కలిశారు. డివిజన్‌లో నెలకొన్న స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులపై ఈ సందర్భంగా ఆయనతో చర్చించారు. డివిజన్‌లో చాలా కాలంగా ఫెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శేఖర్, మన్నె రమేశ్, రాజు, నరసింహ, మణి తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫెక్షన్‌లను వెంటనే గుర్తించి పరిష్కరించాలి

కార్యక్రమంలో పలు హాస్పిటల్స్‌కు చెందిన వైద్య నిపుణులతో కలిసి పాల్గొన్న సీఎంసీ వెల్లోర్ ఇన్ఫెక్షియెస్ డిసీజెస్ స్పెషలిస్ట్, డాక్టర్ జార్జ్ వర్గీస్

మాదాపూర్, ఆగస్టు 16: అభివృద్ధి చెందుతున్న ఇన్ఫెక్షన్‌లను వెంటనే గుర్తించి పరిష్కరించాలని సీఎంసీ వెల్లోర్ ఇన్ఫెక్షియెస్ డిసీజెస్ స్పెషలిస్ట్, డాక్టర్ జార్జ్ వర్గీస్ అన్నారు. జార్జ్ వర్గీస్ మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శుక్రవారం సీఐడీఎస్(క్లినికల్ ఇన్ఫెక్షన్ డిసీజెస్ సొసైటీ) 2024కు చెందిన 14వ వార్షికోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ వెల్లోర్ ఇన్ఫెక్షియెస్ డిసీజెస్ స్పెషలిస్ట్, డాక్టర్ జార్జ్ వర్గీస్ విచ్చేసి అపోలో హైదరాబాద్ ఇన్ఫెక్షియెస్ డిసీజెస్ స్పెషలిస్ట్, డాక్టర్ సునీత నర్రెడ్డీ, అపోలో చెన్నయ్ ఇన్ఫెక్షియెస్ డిసీజెస్ స్పెషలిస్ట్, డాక్టర్ వి.రామ సుబ్రహ్మణ్యం, గ్లెనిగలస్ గ్లోబల్ హాస్పిటల్ చెన్నయ్ స్వామి నాథన్, జూపిటర్ హాస్పిటల్ ముంబై, పూణే రాజీవ్ సోమన్, స్టెర్లింగ్ హాస్పిటల్, అహ్మదాబాద్ ఇన్ఫెక్షియెస్ డిసీజెస్ స్పెషలిస్ట్ అటుల్ పటేల్‌తో జ్యోతిప్రజ్వలన చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కొత్త అంటువ్యాధులు ప్రబలడంతో ఆందోళన పెరుగుతుందన్నారు. 2024లో పశ్చిమ భారతదేశంలో 150 కన్నా ఎక్కువ చండీపూర్ వైరస్ మెదడువాపు కేసులు నమోదైనట్లు తెలిపారు. కేరళలో నిపా వైరస్ ఇన్ఫెక్షన్‌కు సంబంధించి కొత్త కేసులు బయటపడినట్లు తెలిపారు. కేరళ, పశ్చిమ బెంగాల్‌లో 20కి పైగా ప్రైమరీ అమీబిక్ ఎన్సెఫాలిటిస్ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ఈ ఘటనలు అంటువ్యాధుల డైనామిక్ స్వభావాన్ని, అప్రమత్తత, సంసిద్ధతల తక్షణ అవసరాన్ని హైలైట్ చేస్తాయన్నారు. అభివృద్ధి చెందుతున్న ఇన్ఫెక్షన్‌లను వెంటనే గుర్తించి వాటికి ప్రతిస్పందించడానికి నిఘా నెట్‌వర్క్‌ల విస్తరణ అవసరాన్ని సీఐడీఎస్ ప్రతిపాదిస్తుందన్నారు. విస్తృతంగా వ్యాప్తి చెందకుండా నిరోదించడానికి వేగవంతమైన గుర్తింపు, నియంత్రణ ఎంతో అవసరమన్నారు.

డ్రైనేజీలు శుభ్రం చేయాలి

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషాముళ్లపూడి ప్రధాన రహదారి మహంకాళీ నగర్- ఛత్రపతి శివాజీనగర్ వద్ద మ్యాన్ హోల్ పొంగిన ప్రాంతాన్ని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఆయన జలమండలి సిబ్బందిని పిలిపించి ఎయిర్‌టెక్ యంత్రంతో మరమ్మతులు చేయించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, మురుగు నీరు రహదారులపైకి రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. *– మియాపూర్, ఆగస్టు 16*

'మౌంట్ ఎల్‌బ్రస్' అధిరోహించిన బొరంపేట్ వాసి తులసిరెడ్డి

జాతీయపతాకంతో మౌంట్ ఎల్‌బ్రస్ పర్వతంపై పలుపునూరి తులసీరెడ్డి

దుండిగల్, ఆగస్టు16: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బొరంపేట్‌కు చెందిన పలుపునూరి తులసిరెడ్డి యూరప్ ఖండంలోని ఎత్తైన మౌంట్ ఎల్‌బ్రస్ పర్వతాన్ని అధిరోహించాడు. ఈనెల 11వ తేదీన శిఖరం ఎక్కడం ప్రారంభించిన తులసిరెడ్డి ఈనెల 15న యూరప్ ఖండంలోనే అత్యంత ఎత్తైన శిఖరాన్ని అధిరోహించి లక్ష్యాన్ని నాలుగు రోజుల్లోనే చేరుకున్నట్లు తెలిపాడు. దీని ఎత్తు 5642 మీటర్స్ ఉంటుందని, వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ ఆగస్టు 15న అక్కడ జాతీయ పతాకాన్ని చేతపట్టుకొని 'జై భారత్ అని' నినాదాలు చేసినట్లు పేర్కొన్నారు. కాగా తులసిరెడ్డి గత ఏడాది అక్టోబర్‌లో మౌంట్‌కిల్లిమంచారో పర్వతాన్ని అధిరోహించాడు.

దోమల నివారణపై స్పెషల్ ఫోకస్

■ ఫాగింగ్... ఏఎల్‌ఓ చర్యలపై పత్యేక కార్యాచరణ
■ ఒక నెలలో.. ఒక కాలనీలో..
■ నాలుగు సార్లు ఏఎల్‌ఓ.. రెండు సార్లు ఫాగింగ్ చేయాల్సిందే..

కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో ఎంటమాలాజీ అధికారులు, సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న జడ్సీ అపూర్వ చౌహాన్(ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 16 : దోమలను నియంత్రించి... డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాలు అరికట్టే దిశగా కూకట్‌పల్లి జోన్‌లో ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు. ఇటీవలే జోన్ పరిధిలోని రెండు సర్కిళ్లకు చెందిన ఎంటమాలాజీ విభాగంలో జరిగిన అవకతవకలు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా...జోన్‌లో ఇన్‌చార్జి సీనియర్ ఎంటమాలాజీగా పనిచేస్తున్న ఆఫీసర్‌పై చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే... మరోవైపు కాలనీలు, బస్తీలలో దోమలను విజృంభిస్తున్నాయని, దోమల నియంత్రణపై చర్యలు సఫలం కావడంలేదని, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లు, ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జోన్ పరిధిలోని ఎంటమాలాజీ విభాగాలను ప్రక్షాళన.. పటిష్టం చేసే దిశగా జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ప్రత్యేక దృష్టి సారించారు. వారం రోజులుగా జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో పనిచేసే ఎంటమాలాజీ విభాగం అధికారులు, సిబ్బందితో వరుసగా సమావేశాలు నిర్వహించారు. దోమల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. దోమలను లార్వా దశలోనే నియంత్రించాలన్న లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు.

4 సార్లు ఫాగింగ్.. 2 సార్లు ఏఎల్‌ఓ చర్యలు

కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్ల పని చేసే ఎంటమాలాజీ సిబ్బందిలో జవాబుదారీతనం, పారదర్శకతను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ తయారు చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎక్కడాలేని విధంగా.. కాలనీలు, బస్తీల వారీగా ఎంటమాలాజీ విభాగం చేపట్టే యాంటీ లార్వా ఆపరేషన్(ఏఎల్‌ఓ), ఫాగింగ్ చర్యలకు నెల వారీ షెడ్యూల్ ప్రకటించారు. ప్రతి కాలనీ, బస్తీల్లో ప్రతి 15రోజులకు ఒకసారి ఫాగింగ్.. ప్రతి వారం యాంటి లార్వా ఆపరేషన్ చర్యలు చేపట్టాలి. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. ఒక కాలనీలో 1 నెల రోజుల కాలవ్యవధిలో 4సార్లు ఫాగింగ్ చర్యలు.. 2సార్లు యాంటి లార్వా ఆపరేషన్ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. ఒకవేళ ఏదైనా కాలనీలో షెడ్యూల్ ప్రకారం... యాంటి లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చర్యలు నిర్వహించకుంటే.. ఆ ప్రాంతంలో పనిచేసే ఎంటమాలాజీ అసిస్టెంట్(ఏఈ)ను సంప్రదించాలి. ఇక్కడ సమస్య పరిష్కారం కాకుంటే... సీనియర్ ఎంటమాలాజీ(ఎస్ఈ)కి 915483 1836 ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. రాబోయే నెలకు సంబంధించిన షెడ్యూల్‌ను.. ముందు నెల 25వ తేదీన విడుదల చేస్తారు. ఈ షెడ్యూల్‌ను ప్రజాప్రతినిధులకు, కాలనీ, బస్తీల వెల్ఫేర్ అసోసియేషన్‌లకు, కాలనీ ప్రజలకు అందిస్తారు. వినూత్నంగా చేపట్టిన ఈ చర్యలతో దోమలు నియంత్రించే చర్యలు సక్రమంగా సాగుతాయని జడ్సీ తెలిపారు.

లార్వా దశలోనే నియంత్రించేలా..

దోమలను పుట్టుకలోనే అంతం చేసే దిశగా యాంటీ లార్వా ఆపరేషన్ చర్యలను చేపడుతున్నాం. కాలనీలలో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేస్తున్నాం. ప్రజలకు అవగాహనలో భాగంగా ఇంటికి వెళ్లి...ఇంట్లో నీటి నిల్వఉండే సంపులను, పూల కుండీలను, నిరుపయోగ టైర్లను, కూలర్లను పరిశీలించి... ప్రతి వారం నీటి నిల్వలను తొలగించుకోవాలని కోరుతున్నాం. కుంటలలో, నీరు నిలిచే ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేయడం జరుగుతుంది. దోమల వృద్ధికి ఆవాసాలుగా మారుతున్న చెరువులలో గుర్రపుడెక్కను తొలగించే పనులను చేస్తున్నాం. న్నారు. దోమల వృద్ధి అధికంగా ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాం. ప్రజల సహకారంతోనే దోమల నియంత్రణ సాధ్యమవుతుంది.మీ కాలనీలో షెడ్యూల్‌ను పాటించకుంటే 9154831836 ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరుతున్నాం.

– పల్లె మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి సీనియర్ ఎంటమాలాజీ, కూకట్‌పల్లి జోన్

పీజీ విద్యార్థినిపై దాడి చేసిన నిందితులను శిక్షించాలి

సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు, వైద్య విద్యార్థుల నిరసన ర్యాలీ

సూరారంలో నిరసన ప్రదర్శన చేస్తున్న మల్లారెడ్డి హైల్తీసిటీ వైద్య విద్యార్థులు, వైద్యులు

దుండిగల్, ఆగస్టు 16: కోల్‌కత్తాలోని ఆర్‌జే కార్ మెడికల్ కళాశాల ఆవరణలో పీజీ విద్యార్థినిపై జరిగిన పాశవిక దాడిని సమాజంలోని ప్రతిఒక్కరూ ఖండించాలని సూరారంలోని మల్లారెడ్డి హెల్తీసిటీ వైద్యులు, వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హత్యాచార ఘనటకు నిరసనగా శుక్రవారం ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) పిలుపు మేరకు సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు, వైద్య విద్యార్థులు శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూరారం చౌరస్తా నుంచి మల్లారెడ్డి హెల్తీసిటీ వరకు వైద్య విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ప్లకార్డులు పట్టుకుని, నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. వీ వాంట్ జస్టీస్.. నోజస్టీస్ నో సర్వీస్ అంటూ నినదించారు. అనంతరం పలువురు వైద్యవిద్యార్థులు మాట్లాడుతూ .. నేరానికి పాల్పడిన నిందితులను గుర్తించి బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ డాక్టర్స్, డ్యూటీ డాక్టర్స్, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం..

దుండిగల్, ఆగస్టు 16: మద